


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి  సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబ్లమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి-అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పదుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్  వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు  ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు  పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల  గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# మాయాబజార్ -7

## (గత సంచిక తరువాయి)

వంటశాలలో పెళ్ళిపెద్దలుప్రవేశం. ముగ్గురూ శర్మ, శాస్త్రిలను ఆహ్వానిస్తూ- దయచెయ్యండి దయచెయ్యండి.

చిన్న: సాములూ అటుకాదు.ఇటు. చిత్తగించండి. (వంటకాలు చూపిస్తూ) గారెలు,బూరెలు, తేనీరు,పోనీరు, లడ్లు, జిలేబీలు, బొబ్బట్లు,దిబ్బట్లు.

శాస్త్రి-తీసిపారేస్తూ: సరి. ఇవి భక్ష్యాలూ.

చిన్నమయ: పులిహోర. కలిహోర గలిహోర మలిహోర-

శర్మ: సరిసరి- ఇవన్నీ చిత్రాన్నాలూ.

చిన్న: జీడిపప్పు పాయసం, మధురసాలు, ఫలరసాలు-

శ: సరిసరి- ఇవన్నీ పానీయాలూ.

చి: ఓహోహో-వంకాయ, టెంకాయ, బీరకాయ, బూడిదగుమ్మడికాయ.

శ: చాలు చాలు చాలు. ఇవన్నీ కూరగాయలూ. ఇంతకూ అసలు వంటకం ఏదయ్యా? ముగ్గురూ మొహమొహాలు చూసుకుంటారు. లంబు జంబు కూడబలుక్కుని: ఓ-అదా. తెస్తాం.తెస్తాం. —పోతూవుంటారు.

శర్మ: ఏమిటీ?ఏం తెస్తారు?

లం: అదే. నరమాంసం! నరమాంసం!

చిన్న: ఉష్.

శర్మ: శివశివా శివశివా. మేమేం రాక్షసులమనుకున్నారటయ్యా? ( Irony of speech. రాక్షసులు రాక్షసుల స్వభావంతోనే ఆలోచిస్తారు మరి!)

లంబు:మరి మనుషులైతే ఏం కావాలో చెప్పండెహె.

శర్మ: ఏంటయ్యా.చెప్పేది? పెళ్ళిపెద్దలమని శుద్ధమొద్దులు తయారయ్యారు. నాగరికుల విందుభోజనంలో ముఖ్యంగా వెయ్యవలసిన పదార్థమే లేదయ్యా.

జంబు: ఊరికే సతాయించక అదేదో చెప్పి చావండెహే.

శర్మ: గోంగూర! శాకంబరీదేవి (కాదంబరి-కి పేరడీ) ప్రసాదం! ఆంధ్రశాకం! అదిలేందే ప్రభువులు ముద్దయినా ముట్టరు!

శాస్త్రి: అసలు గోంగూరంటే ఏంటో తెలుసామీకూ?

చిన్న: తెలుసు సాములూ. మోపులు మోపులు తెప్పిస్తాం! దయచెయ్యండి సాములూ. అందరూ బయటికి వెళ్తారు.

మాయా శశిరేఖ అటుగాపోతూ వాసన ఆఘ్రాణించి వంటశాలలోకి ఘటోత్కచునిగా గదాధారియై ప్రవేశం. వంటకాలను ఆశ్చర్యంగా,ఆనందంగా చూస్తూ-

పాట

ఘటోత్కచుడు : వివాహ భోజనంబు వింతైన వంటకంబు

వియ్యాలవారి విందు ఒహోహ్హో నాకె ముందు

అహహ్హహహ్హ హహ్హ "3"

ఔరర గారెలెల్ల అయ్యారె బూరెలెల్ల

ఓహ్హోరె అరిసెలెల్ల ఇవెల్ల నాకె చెల్ల "వివాహ"

భళీరె లడ్డులందు వహ్ ఫేణిపోణిలిందు

భలే జిలేబి ముందు ఇవెల్ల నాకె విందు "వివాహ"

మఝూరె అప్పడాలు పులిహోర ధప్పళాలు

వహ్వారె పాయసాలు ఇవెల్ల నాకె చాలు "వివాహ"

తదుపరి గదని గోడకి ఆనించి పీటవేసుకు కూర్చుని బృహత్ ప్రమాణానికి శరీరం పెంచుతాడు– శాకపాకాలను రమ్మని సైగచేస్తాడు. అవన్నీ వచ్చి ఒబ్బిడిగా ముందు నిలుస్తాయి. (ఇక్కడినుండీ భోజనమంతా అద్భుతమైన ట్రిక్ ఫోటోగ్రఫీ. భోజన పదార్థాలు వాటంతట అవే నోట్లోకి వచ్చి పడుతుంటాయి. ఈ సీన్లో ఎస్.వి,రంగారావు నటన నిరుపమానం. ఈ ఒక్క సీను కోసం జనం పదేపదే సినిమా చూసేవారంటే అతిశయోక్తి కాదు.ఈ హాస్య సన్నివేశం సినిమాకి మకుటాయమానం.) చిన్నమయ,లంబు,జంబులు కిటికీలోంచి తమ నాయకుని భోజనపరాక్రమం చూసి ఆనందిస్తారు. ఘటోత్కచుడు ఖాళీ పాత్రలను విసిరేస్తాడు. భోజనం ముగించి ఆ మహాకాయుడు గదతీయబోతే అది అతి చిన్న ప్రమాణంలో వుంటుంది. (ఇంత చిన్న విషయంలో కూడా ఏమరుపాటులేని దర్శకత్వ ప్రతిభ అత్యద్భుతం) ఘటోత్కచుడు మాయమౌతాడు.

శర్మ,శాస్త్రి ప్రవేశం. ఎక్కడయ్యా పెళ్ళిపెద్దలూ? గోంగూర తీసుకురమ్మంటే ఇంత ఆలస్యమెందుకయ్యా? —అక్కడ ఖాళీ పాత్రలు చూసి–శర్మా శర్మా, ఇదేమిటి?అంతా ఖాళీలైనాయి? —వివిధ పదార్థాలు ప్రస్తావిస్తూ–ఖాళీ ఖాళీ ఖాళీ.–పెళ్ళిపెద్దలు నవ్వుకుంటారు.——శర్మ: వెళ్ళి ఇక్కడి సంగతంతా చెప్పి దుంప తెంపించి ధూపం వేయించి– ఇంకా ఏం చూస్తావోయ్? ఖాళీపాకంవోయ్ (స్థాళీపాకానికి పేరడీ) —— శర్మని ఈడ్చుకుపోతాడు. వాళ్ళు వెళ్ళగానే చిన్నమయ కిటికీలోంచి మంత్రదండం ఊపుతూ పాత్రల్లో భక్ష్యాలను యథాస్థితికి తీసుకువస్తాడు.

లక్ష్మణకుమారుని మందిరం——సారధి: ఇంతకూ ఆ పెళ్ళికూతురు నచ్చిందాండీ?

ల.కు: ఆ సుందరిని చూడగానే పరవశించాను. వరించాను, మోహించాను. గానం చేశాను.

సా: మరి పెళ్ళికూతురు...

ల.కు: నిస్పృహతో– ఆఁ. పెళ్ళికూతురు? పెద్దలున్నారంటుంది.దూరమంటుంది. రేపటిదాకా ఆగమంటుంది. (విచారంగా).

సా: తమరేఁవిటి ప్రభూ? అభిమన్యుడైతే ఈపాటికే హతాశుడైపోయేవాడు.(ఇచ్చకాల మాటలు)

ల.కు: సారధీ.లెస్స పలికితివి. —చప్పట్లు చరచబోయి ఆగి...రెండూ ఒకటిగా చేరిస్తే అతుక్కుపోతాయి ,(Bitter experience తలచుకుని)

సా: ఓహో...

శర్మ,శాస్త్రి శకునితో కలిసి ప్రవేశం : చేసిన వంటకాలన్నీ వాళ్ళే మెక్కేసి మనకి ఖాళీ పాత్రలు మిగిల్చారు. (నిండు పాత్రలు చూసి ఆశ్చర్యంతో బెదురుతూ) ఆఁ!... ప్రత్యక్షమైన వంటకాల పేర్లు వల్లిస్తుంటారు.

శకుని– వేలుచూపించి రమ్మని: నేను వియ్యాలవారిని అల్లరిచెయ్యమంటే మీరు నన్నే అల్లరి చేస్తున్నారా? మీకేమైనా దయ్యం పట్టిందా?( Irony of speech. అంతా రాక్షస మేళమేగా?) శర్మ,శాస్త్రి: అస్తు.

శకు: అస్తేమిటి? విడిదిలో దిగినప్పటినుండీ చూస్తున్నాను. మీకు వచ్చే బుద్ధి  పోయే బుద్ధిగావుంది. ఇక బుద్ధి కుదుర్చుకోకపోతే తలలకు తైలమర్దనం చేయిస్తాను– నిష్క్రమిస్తాడు.

శర్మ:ఏమిటిది? (వేళ్ళు)

శాస్త్రి:మూడు!

శర్మ:గిల్లు– పాత్రలుచూపించి...ఏమిటి?అని వాపోతాడు.

పెళ్ళిపెద్దలు ప్రవేశం– లంబు,జంబు: గింబళీ కావాలట.గింబళీ.

చిన్నమయ:ఉష్. –దండం తిప్పి, గింబళీ(?) తెప్పిస్తాడు.

లంబు, జంబు: అహ్హహ్హా.

చిన్న:ఉష్.

లంబు,జంబు: గిల్పం, గిల్పం! వస్తున్నారు తస్మదీయులు.– ముగ్గురూ మాయమౌతారు. (హాస్య సన్నివేశం)

శర్మ,శాస్త్రి ప్రవేశం. తలపాగాలు పక్కనపెట్టి, చేతికర్రలు గోడకి ఆనించి.

శర్మ:అది కనికట్టా, మాయా, ఇంద్రజాలమా?

శాస్త్రి: ఏమీలేదు. మేహభ్రాంతి.

శ:అంతేనంటావా?

శా:అంతే.

ముందుకుపోయిచూసి.శ: ఇదేనా గింబళీ?

శా: చిన్నదితీసి పెద్దది వేశారు.

శ:గింబళి అంటే కంబళికి అప్పగారనుకున్నారు.

శా:వాళ్ళ తాతలు దిగిరావాలి గింబళి రావాలంటే!

శా:తమలపాకులు.

శ: కానీ.——ఇద్దరూ కూర్చుని తమలపాకులు చుట్టుకుంటూ. అంతలో పళ్ళెం పక్కకి కదిలిపోతుంది. పరధ్యానంగా తడిమిచూసి. దానిని యథాస్థానంలో పెడతారు.

శా: శర్మా. కనబడ్డదీ.మాయమైనదీ.

శ: మాయమైనదీ. కనబడ్డదీ.

శా:ఇదీ భ్రాంతేనంటావా?

శ: ఇది కూడా భ్రాంతే. పారిపోయిన పళ్ళెం పట్టుకుని అడుగున తడిమి చూస్తారు.

శా: ఈ భ్రాంతికి కారణం?

శ: కారణమేముంది? పైత్యప్రకోపంలో ఒక రూపం. మళ్ళీఅంతలో ఆ గింబళి రెండు పక్కలా చుట్టుకుపోయి వాళ్ళని నెట్టుతుంది.( ఈ ట్రిక్ షాట్ ఎలా తీశారో ఇప్పటికీ చిక్కువిడని మిస్టరీగా మిగిలిపోయింది.)

శాస్త్రి: గింబళి. అందుకే చుట్టుకుపోతున్నది. —ఇద్దరూ చెరోవైపు అడ్డుకుని సాగదీస్తారు. అంతలో పళ్ళెం పారిపోతుంది. ఇద్దరూ కాళ్ళతో గింబళి చుట్టుకోకుండా ఆపుతూ పళ్ళాన్ని ఆపుతారు.

శాస్త్రి: శర్మా.ఇదీభ్రాంతేనా?

శర్మ:ఇది సమాధి భ్రాంతి.

శా: సమాధీ వద్దు.గింబళీ వద్దు. పోదాం పదవయ్యా. గింబళీ లేచి కొట్టబోతుంది. తమలపాకుల పళ్ళెం తీసుకుని ఇద్దరూ తల్పం చేరి మెత్తదనం చూసి——గిల్పం!గిల్పం!

శా: గింబళి సంగతేమిటిగాని గిల్పం మాబాగా వుందయ్యా. . తల్పం పందిరికోళ్ళు చెరోవైపునుండీ వాళ్ళ తలలు మొట్టుతాయి.

శర్మ,శాస్త్రి—అమ్మో.అమ్మో. —లేచి ద్వారం వద్దకుపోగా తలుపులు మూసుకుపోయి దండంకర్రలు పైకిలేచి కొడుతూ వాళ్ళను ఎదుటిమూలలకు తరుముతాయి.వాళ్ళు బుద్ధిగా కూర్చోగానే ఆ కర్రలు మూలకిపోయి నిల్చుంటాయి. వాళ్ళు ఆశ్చర్యంగా చూస్తుండగానే పాదరక్షలుపోయి తల్పంపై చేరుతాయి. —బయట సారథి హుషారుగా వస్తుంటాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments